# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త


## వెంకటేశ్వరునికి ఊంజల్‌సేవ, గ్రామోత్సవం



వడమాలపేట, జూన్ 13 ప్రభాతవార్త: అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామివారికి శనివారం సాయంత్రం ఊంజల్‌సేవ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శనివారం వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఉభయదేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుదీర్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన స్వామివారు పురవీధుల్లో విహరించారు. ఆలయ అధికారి వేణు గోపాల్, ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, అర్చకులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులతో పోటెత్తిన కాణిపాకం



కాణిపాకం, జూన్ 13 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవాలయం శనివారం భక్తులతో పోటెత్తింది. రెండవ శనివారం, ఆదివారం సెలవు రోజులు కావడంతో స్వామి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

### డిజిటల్ తాళంతో
# గ్రామ పాలన అస్తవ్యస్తం!

- నిలిచిపోయిన సిబ్బంది జీతాలు !
- సిస్టమ్ లోపం పేరిట సిబ్బందిని సంక్షోభంలోకి నెట్టిన పాలన
- డీజల్, బ్లీచింగ్‌కైనా డబ్బులు లేక కుదేలవుతున్న పారిశుధ్యం
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడుతున్న గ్రామస్థాయి యంత్రాంగం



తిరుపతిరూరల్, జూన్ 13 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ పరిధిలో గ్రామ పంచాయతీల పరిస్థితి రోజురోజుకు దిగజారుతుంది. డిజిటల్ కీ లేకపోవడాన్ని కారణంగా చూపుతూ ప్రత్యేక అధికారులు చేతులు ఎత్తేయడంతో గ్రామపాలన పేపర్ మీద మాత్రమే మిగిలిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**డిజిటల్ అడ్డంకి....జీవనోపాధికి తాళం**

సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత నియమించిన ప్రత్యేక అధికారులకు ఇప్పటికీ డిజిటల్ సిగ్నేచర్ ఇవ్వకపోవడం పాలనలో తీవ్రమైన లోపాన్ని బయటపెడుతుంది. దీంతో ఆయా గ్రామ పంచాయతీలలో సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు నిలిచిపోయాయి. బిల్లుల ఆమోదం పొందకుండా పెండింగ్‌లో పేరుకుపోతున్నాయి. గ్రామస్థాయి పరిపాలన పూర్తిగా స్తంభించింది. 'సాంకేతిక కారణాలు' అనే మాటతో సమస్యను తేలిగ్గా తీసుకోవడం సిబ్బందిలో అగ్రహం రగిలిస్తోంది. పంచాయతీ కార్యదర్శులే ఇప్పుడు అనధికార ఆర్థికాధికారులుగా మారాల్సిన పరిస్థితి ఏర్పండి. సిబ్బంది జీతాలు ఇవ్వలేక... పాలనా నిర్వాహణ కోసం అప్పులు చేస్తున్నారు. కుటుంబ అవసరాలు తీర్చుకోలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. నిధుల లేమితో గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. చెత్త సేకరణ వాహనాలకు డీజల్ లేక కొన్ని వాహనాలు నిలిచిపోగా...మరికొన్ని వాహనాలు మరమ్మత్తుకు గురై మూలనపడి ఉన్నాయి. బ్లీచింగ్, శానిటరీ సామాగ్రి కోనుగోలు చేయలేక వ్యాధుల భయం పట్టుకొంటుంది. "గ్రామాలు స్వచ్ఛభారత్‌ను ఎగతాళి చేసే పరిస్థితికి చేరుకున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ కీ లాంటి ప్రాథమిక అంశం కూడా పరిష్కరించలేకపోవడం ప్రభుత్వ పరిపాలనా వైఫల్యాన్ని బహిర్గతం చేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామ పంచాయతీలు నిధులేక నిర్ణయాధికారం లేక నిష్క్రియ కేంద్రాలుగా మారిపోతున్నాయన్న అందోళన వ్యక్తమవుతోంది. పంచాయతీ సిబ్బంది...కార్యధర్ములు ఒకే స్వరంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. వెంటనే డిజిటల్ కీ అందించాలని, పెండింగ్ జాతీలు విడుదల చేయాలని, మెయింటెనెన్స్ ఖర్చులకు అత్యవసర నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామ పాలన బలహీనమైతే అభివృద్ధి కేవలం నినా దంగా మిగులుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని చర్యలు తీసుకుంటారా...లేక గ్రామాలను ఈ సంక్షోభంలోనే వదిలేస్తుందా! అన్నది కీలక ప్రశ్నగా మారింది.

## టీటీడీ ఉద్యోగి ఆత్మహత్య

*తిరుపతి, జూన్ 13 ప్రభాతవార్త:* ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంజయ్‌గాంధీ కాలనీలో టిటిడి ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. గోవిందరాజుస్వామి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పూజారి భాను ప్రకాష్(26) మూడేళ్ల క్రితం నాగవేణిని ప్రేమించి పెద్దలను అంగీకారంతో వివాహం చేసుకున్నాడు. నాగవేణి భాను ప్రకాష్ దంపతులకు పది రోజుల క్రితం కుమారుడు జన్మించాడు. భానుప్రకాష్ కుటుంబ కలహాల వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. మృతుడు తల్లి శారద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మహత్య ఘటనపై ఈస్ట్ సిఐ శ్రీనివాసులు విచారిస్తున్నారు.

# తోతాపురి ధర మరింత పతనం

### - ఫ్యాక్టరీల్లో కేజీ రూ.6, ర్యాంపుల్లో రూ.5కు కొనుగోలు- ఆందోళనలో మామిడి రైతు



చిత్తూరు, జూన్ 13 ప్రభాతవార్త: జిల్లాలో తోతాపురి రకం మామిడి ధర మరింత పతనం అయ్యింది. నిన్నటి వరకు మామిడి పల్ప్ ఫ్యాక్టరీల్లో రైతుల నుండి కేజీ తోతాపురి మామిడి రూ.7, ర్యాంపుల్లో కేజీ తోతాపురి రూ.6 కొనుగోళ్ళు జరుగుతుండగా, ఈ ధర ప్రస్తుతం ఫ్యాక్టరీల వద్ద కేజీ తోతాపురి రూ.6, ర్యాంపుల వద్ద కేజీ తోతాపురి రూ.5కు పడిపోయింది. మామిడి రైతులు తోతాపురి మామిడి ధర కేజీ రూ.18 చెల్లించాలని రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్న నేపథ్యంలో తోతాపురి కేజీ మామిడి రూ.7కు ఫ్యాక్టరీలు కొనుగోలు చేస్తుండగా ప్రస్తుతం ఆ ధర మరొక రూపాయి తగ్గడంతో మామిడి రైతుల్లో తీవ్ర ఆందోళన నెల కొంది. గత సీజన్‌లో మామిడి రైతును ఆదుకోవడానికి ప్రభుత్వం మద్దతు ధర కేజీకి రూ.4 చెల్లించగా, ఈ సీజన్ ప్రారంభం నుండి మామిడి రైతులు కష్టాలను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోవడంతో రైతుల్లో మరింత ఆందోళన నెలకొంది. ఓ వైపు మార్కెట్‌లో తోతాపురి మామిడి పరిస్థితి ధర పతనమై దారుణంగా వుండటం, మరోవైపు ప్రభుత్వం నుండి మామిడి రైతుకు ఉపశమనం కల్గించే నిర్ణయం ఇప్పటి వరకు వెలువడక పోవడంతో రైతులు నిరాశా నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాలో మామిడి పల్ప్ తయారు చేయడానికి 31 మేరకు ఫ్యాక్టరీలు వున్నప్పటికీ అందులో ఈ సీజన్ ప్రారంభమైన అనంతరం ప్రస్తుతం 28 పల్ప్ ఫ్యాక్టరీలు మాత్రమే రన్నింగ్‌లో వున్నాయి. ఈ ఫ్యాక్టరీల్లో కేవలం 16 పల్ప్ ఫ్యాక్టరీలు మాత్రమే రైతుల నుండి తోతాపురి మామిడిని కొనుగోలు చేస్తున్నాయి. జిల్లాలో వున్న మామిడి పల్ప్ ఫ్యాక్టరీలు అన్ని ఈ సీజన్‌లో పని చేసే విధంగా చర్యలు తీసుకుంటామని, అలాగే ప్రస్తుతం పని చేస్తున్న పల్ప్ ఫ్యాక్టరీలు అన్నింటిలోను రైతుల నుండి తోతాపురి రకం మామిడిని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు మాత్రం ఇప్పటికీ భిన్నంగా వుంటున్నాయి. జిల్లాలో మామిడి రైతులను ఆదుకోవాలని నిర్ణయించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ మామిడి పల్ప్ ఫ్యాక్టరీల యాజమానులతో సమావేశం నిర్వహించి మామిడి మద్దతు ధర నిర్ణయించినప్పటికీ ఫ్యాక్టరీలు ఆ మేరకు రైతులకు చెల్లింపులు చేయడానికి ససేమిరా ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌తో పాటు ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు మామిడి పల్ప్ ఫ్యాక్టరీల్లో తనిఖీలు నిర్వహించి తోతాపురి మామిడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలు ఇవ్వాలని ఆశిద్దాం. అలాగే ప్రభుత్వం సైతం తోతాపురి మామిడి రైతుకు గత సీజన్‌లో ప్రకటించిన విధంగా కేజీకి రూ.4 సబ్సిడీని చెల్లించాలని తోతాపురి మామిడి రైతులు కోరుతున్నారు.

# సునామిలా...శివభక్తులు

### రాహుకేతుదోష నివారణ పూజలకు గంటల కొద్ది నిరీక్షణ
### ఇఓ స్వీయ పర్యవేక్షణ -దళారులను కట్టడి చేసిన అధికారులు



శ్రీకాళహస్తి, జూన్ 13 ప్రభాతవార్త దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయం మూడు రోజుల నుంచి భక్తులతో కిట కిట లాడుతుంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి సునామిలా వచ్చిన భక్తులతో పట్టణం కిట కిట లాడింది. సాధారణంగా ఇక్కడి ఆలయంలో అభిషేకాలకు పది మందిని మాత్రమే అనుమతించాలి. భక్తుల మనోభావాలను దెబ్బతీయకుండా వచ్చిన భక్తులను సంతృప్తి పరచుటకు పాలకులు అధికారులు చొరవ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చిన భక్తులకు స్వామి అమ్మవార్ల అభిషేక దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. రాహుకేతుదోష నివారణ పూజలు 6 వేలు దాటాయంటే ఇక రద్దీ అర్థమౌతుంది. కొత్తగా ప్రవేశ పెట్టిన ఆన్‌లైన్‌కు భక్తులు అలవాటు పడుతున్నారు.

**ఇఓ వ్యక్తిగత పర్యవేక్షణ:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీని ముందుగానే గుర్తించిన ఆలయ ఇఓ బికె వెంకటేశులు, డెప్యూటీ ఇఓ కృష్ణారెడ్డి, ఎఇఓలు లోకేష్‌బాబు, విద్యా సాగర్‌రెడ్డి ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టిలు సమీక్షించుకున్నారు. విమర్శలు, ఆరోపణలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నారు. అధికారులు ఎంత కట్టడి చేసినా కొందరు దళారులు తమ పంధానుమార్చుకోలేదు. రాష్ట్రంలో వేసవి సెలవులు రావటం, పరీక్షా ఫలితా లు వెలువడటం, కర్నాటకలో ఎన్నికల సందడి, తమిళనాడు నుంచి వరుస సెలవులతో శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తులతో కిట కిట లాడింది. వృద్ధులు, గర్భిణీ మహిళలకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసి ఆ క్యూలైన్ నుంచి అనుమతించారు. శీఘ్ర దర్శనం జరిపించి ప్రశంసలందుకున్నారు. అలాగే ఆలయ ఎఇఓలు లోకేష్‌బాబు, విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, లోకేష్‌బాబు, నాగభూషణం యాదవ్, పిఆర్‌ఓ రవి సిబ్బంది ఎస్‌పిఎస్ సిబ్బంది, సెక్యూటిరి సిబ్బంది సహాకరించారు.

# దారుణహత్య
### అలస్యంగా వెలుగులోకి..

గంగవరం, జూన్ 13, ప్రభాతవార్త: పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం దండపల్లె కురప్పల్లెలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జయదీప్ దారుణహత్యకు గురయ్యాడు. అమ్మాయి పిలిచిం దని వెళితే అమ్మాయి బంధువులు కుటుంబ సభ్యులు జయదీప్‌ను కొట్టి మిద్దెపైనుండి కిందకు పడవేసినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ నెల 3న అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన అలస్యంగా వెలు గులోకి రాగా తీవ్రంగా గాయపడ్డ జయదీప్ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. బంగారుపాళ్యం మండలం జి.కురప్పల్లెకు చెందిన హేమావతి కుమారుడు జయదీప్ బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న సొంతగ్రామానికి వచ్చిన జయదేవ్‌కు దండపల్లె కురప్పల్లెలో ఒక అమ్మాయి నుండి ఫోన్‌కాల్ వచ్చినట్లు ఇంటివద్ద ఎవరూలేరు వెంటనే బయలుదేరి రావాలని ఫోన్‌చేసినట్టు సమాచారం. ఫోన్‌కాల్ అందుకున్న జయదేవ్‌ను వినీత్ అనే మరో యువకుడు మోటార్ సైకిల్‌పై ఈ నెల 3న సాయంత్రం 5గంటల సమయంలో దండపల్లె కురప్పల్లెలో లింగప్ప ఇంటికి తీసుకు వచ్చినట్లు తెలుస్తోంది.



మృతుడు జయదీప్

ఐతే నలుగురు యువకులు కొట్టి మిద్దెపైనుండి కిందకు తోసివేయడంతో జయదేవ్ అపస్మారక స్థితిలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన మునిరాజ్ వెంటనే వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించారు. 9 రోజుల పాటు చికిత్స పొందినా ఫలితంలేక పోవడంతో తగిన స్థోమత లేక పలమనేరులో ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జయదేవ్ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఐతే ప్రమాదవశాత్తు మిద్దెపైనుండి పడ్డాడని లింగప్ప కుటుంబ సభ్యులు చెపుతుండగా కొట్టి చంపేశారని మృతుని బంధువులు అరోపిస్తున్నారు. మృతదేహాన్ని శవ పరక్ష నిమిత్తం పలమనేరు ప్రభుత్వఆసుపత్రిలో వుంచారు. గంగవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పచ్చిపాలపల్లిలో చోరీ

### బంగారు, వెండి ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల అపహరణ



పాకాల, జూన్ 13, ప్రభాతవార్త: పాకాల మండలం ఉట్లవారిపల్లి పంచాయతీ పరిధిలోని పచ్చిపాలపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటిలో చోరీకి పాల్పడిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పచ్చిపాలపల్లి గ్రామానికి చెందిన ఈ. బిందు ప్రియ తన తల్లిదండ్రులు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి ఇంటికి తాళం వేసి ఉంచి, ఇంటి పర్యవేక్షణ బాధ్య తను తన అమ్మమ్మకు అప్పగించారు. కుటుంబ సభ్యులు వారానికి ఒకసారి ఇంటిని పరిశీలిస్తూ వస్తున్నారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం ఇంటిని శుభ్రం చేసి తాళం వేసి వెళ్లగా, 13వ తేదీ ఉదయం ఇంటి హాలులోని చెక్క తలుపు పగులగొట్టబడినట్లు, ఇంట్లోని బీరువాలు ధ్వంసం చేయబడినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఇంటిని పరిశీలించగా, బీరువాలో భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు చోరీకి గురైనట్లు తెలిసింది. చోరీకి గురైన వస్తువుల్లో సుమారు 30 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు బంగారు బొట్లు, ఒక నల్లపూసల బంగారు దండ, సుమారు 80 గ్రాముల వెండి గొలుసులు, ఒక ఎల్ఈడీ టీవీ, ఒక బాక్స్ టీవీ ఉన్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి పైభాగం నుంచి ప్రవేశించి ఈ చోరీకి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పాకాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. చిన్న గోవిందు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులను త్వరగా గుర్తించి, చోరీకి గురైన ఆస్తిని స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని దర్యాప్తు అధికారులను ఆదేశించారు. బాధితురాలు ఈ.బిందు ప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాకాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన ఎస్ఐ సి.తరుణ్ దర్యాప్తు చేపట్టారు. నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# గిరిజన విద్యార్థుల ప్రగతి రథం.. గురుకులం !

### రాష్ట్ర సగటును మించిన ఫలితాలు.. ఐఐటీ, నీట్‌లలో సత్తా చాటుతున్న విద్యార్థులు
### 199 విద్యాసంస్థల్లో 53 వేల మందికి పైగా నాణ్యమైన ఉచిత విద్య, వసతి.. క్రీడల్లోనూ జాతీయ స్థాయిలో పతకాల పంట

తిరుపతి విద్య, జూన్ 13 ప్రభాతవార్త గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని అందిస్తూ, అత్యున్నత పోటీ పరీక్షల్లో వారిని విజేతలుగా నిలపడంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ ఆదర్శంగా నిలుస్తోంది. అటవీ, మారుమూల ప్రాంతాల గిరిజన బిడ్డల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా అమరావతి కేంద్రంగా ఈ సంస్థ నిరంతరం ముందంజలో కొనసాగుతోంది.ప్రస్తుతం ఈ సంస్థ పరిధిలో బాలురకు 98, బాలికలకు 73 విద్యాసంస్థలతో పాటు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని 28 ఏకలవ్య మోడల్ పాఠశాలలు కలిపి మొత్తం 199 విద్యాసంస్థలు నడుస్తున్నాయి. వీటిలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం 53,127 మంది విద్యార్థులు ఉచితంగా విద్యను అభ్యసిస్తున్నారు.

**పదో తరగతి, ఇంటర్‌లో రికార్డు స్థాయి ఫలితాలు**

అత్యంత ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో 202526 విద్యా సంవత్సరానికి గురుకులాలు అద్భుత ఫలితాలను సాధించాయి.పదో తరగతి 79.68 శాతం ఉత్తీర్ణతతో విద్యార్థులు సత్తా చాటారు. ఒక విద్యార్థి ఏకంగా 591 మార్కులు సాధించి రికార్డు సృష్టించగా, 11 పాఠశాలలు 100 వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.ఇంటర్మీడియట్ రాష్ట్ర సగటు ఉత్తీర్ణత 81 శాతం కంటే ఎంతో మెరు గ్గా.. గిరిజన గురుకులాలు ఏకంగా 93 ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించాయి. ఇంటర్‌లో సాధారణ కోర్సులతో పాటు విద్యా





ర్థుల ఉపాధి కోసం ప్రత్యేకంగా వృత్తి విద్యా (ఒకేషనల్ ) కోర్సులు కూడా అందిస్తున్నారు.

**ఐఐటీ,జేఈఈ, నీట్‌లలో గిరిజన బిడ్డల కేక !**

కార్పొరేట్ విద్యాసంస్థలకు పోటీగా ఇక్కడ ఐఐటీ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణతో 202526 విద్యా సంవత్సరంలో 146 మంది విద్యార్థులు ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించగా,అందులో 30 మంది అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు ఎంపికై తమ ప్రతిభను నిరూపించుకున్నారు.

**క్రీడల్లోనూ బంగారు కొండలు**

చదువుతో పాటు క్రీడలకూ ఇక్కడ పెద్దపీట వేస్తున్నారు. అరకు కేంద్రంగా నడుస్తున్న ప్రత్యేక గిరిజన క్రీడా పాఠశాల్లద్వారా విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ ఇస్తున్నారు.రాష్ట్ర స్థాయి పోటీల్లో గురుకులాల నుంచి 26 మంది విద్యార్థులు పాల్గొని 2 స్వర్ణ, 6 రజత, 2 కాంస్య పతకాలు గెలుచుకున్నారు.జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ఐదుగురు విద్యార్థులు పోటీ పడగా, ఒక విద్యార్థి రజత పతకం (సిల్వర్ మెడల్ ) సాధించి ఆంధ్రప్రదేశ్ కీర్తిని జాతీయ స్థాయిలో చాటాడు.

**ప్రత్యేక శ్రద్ధ... కార్పొరేట్ స్థాయి వసతులు**

విద్యార్థుల చదువు కోసం ఉదయం, రాత్రి వేళల్లో ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తూ ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారు. ఉదయాన్నే యోగాతో పాటు, వ్యాయామ ఉపాధ్యాయుల (పిడి) ఆధ్వర్యంలో ఆటల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న తల్లికి వందనం, ఎస్ ఆర్ కే వీ ఎం కిట్ వంటి సంక్షేమ పథకాలతో పాటు విద్యార్థులకు ఉచిత విద్య, వసతి, పౌష్టికాహారం, పరిశుభ్రమైన తాగునీరు అందిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్య భద్రత కోసం నిరంతరం ఏఎన్ఎంలు (ఏ ఎన్ ఎం), హౌస్ మాస్టర్లు, వార్డెన్లు అందుబాటులో ఉంటూ రక్షణగా నిలుస్తున్నారు.క్రమశిక్షణ, క్రీడలు, సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్న ఏపీ గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ నేడు రాష్ట్రానికే గర్వకారణంగా నిలుస్తోందని విద్యా రంగ నిపుణులు కొనియాడుతున్నారు.

### తడ మండలంలో
# వరుస అగ్ని ప్రమాదాలు
### స్థానికుల్లో ఆందోళన..



అగ్నికి ఆహుతవుతున్న బస్సు,



చెక్కల గోడౌన్‌లో భారీ మంటలు

తడ, జూన్ 13 ప్రభాతవార్త: మండలంలో శనివారం వరుస అగ్ని ప్రమాదాలతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. కార్మికుల బస్సు దగ్నం ఆయన కొద్దిసేపటికి పూడి పంచాయితీ పరిధిలో చెక్కల గోడౌన్‌లో భారీ మంటలు చెలరేగాయి. దట్టమైన మంటలు పొగ వ్యాప్తి చెందడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.గోడౌన్ లో నిల్వ ఉన్న చెక్కలు అగ్నికి ఆహుతి కావడంతో ఆస్తి నష్టం వాటిల్లింది. సంఘటనా స్థలానికి పోలీసులు అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కొద్ది రోజుల క్రితమే కారూరు చెక్ పోస్ట్ సమీపంలో స్క్రాప్ గోడౌన్ లో చెలరేగిన మంటలు అదుపులోకి తీసుకొచ్చేందుకు మూడు నాలుగు రోజులు పోలీసులు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. తడ పరిసర ప్రాంతాలలో అనుమతులకు విరుద్ధంగా ఎటువంటి ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించకుండా అనేక మంది వ్యాపారస్తులు స్క్రాప్ వ్యాపారాలు పరిశ్రమల నుంచి సేకరించిన వ్యర్థాలు నిల్వ చేస్తున్నారు ఇలాంటి వారిపై చర్యలు చేపట్టుకుంటే అగ్ని ప్రమాదాలు మరలా సంభవించే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డంపింగ్ చేస్తున్న స్క్రాప్ వ్యాపారస్తులు తగిన సేఫ్టీ ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు చేపట్టి ప్రమాదాలు అరికట్టాలని కోరుకుంటున్నారు..

## ప్రధాన రహదారి భూ బాధితులకు

### పరిహారం అందించేందుకు కృషి చేయండి

### తాసిల్దార్ కు ఆదేశాలు ఇచ్చిన ఆర్డిఓ రామ్మోహన్.

రైల్వే కోడూరు అర్బన్, జూన్ 13 ప్రభాత వార్త.



నేషనల్ హైవే గ్రీన్ ఫీల్డ్ ప్రధాన రహదారికి భూములు కోల్పోయిన బాధిత రైతులకు పరిహారం అందించేందుకు త్వరితగతిన కృషి చేయాలని కోడూరు తాసిల్దార్ అమర్నాథ్కు తిరుపతి ఆర్డిఓ బి రామ్ మోహన్ నిర్దిష్టమైన ఆదేశాలను జారీ చేశారు. శనివారం ఆర్డిఓ రైల్వే కోడూరు పట్టణంలోని హైవే రహదారి వెళ్లే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారికి భూములు కోల్పోయి ఇంతవరకు పరిహారం అందని బాధిత రైతులు ఆయనకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవంలో ఉన్న రైతులు భూములు హైవే రహదారికి ఎంత ఎంత పోయాయో సర్వే చేసి వారికి రావలసిన పరిహారాన్ని గురించి రెవెన్యూ అధికారులు ఎలాంటి రికార్డుల్లో పెండింగ్ లేకుండా అందజేసేందుకు మీ వంతు కృషి చేయాలని ఆదేశించారు. రహదారి కోసం భూములు కోల్పోయిన రైతులకు సంబంధించి కొంతమందికి ఆన్లైన్లో లేకపోగా, మరి కొంతమంది రైతులు భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డులలో తప్పుడుగా నమోదు కావడంతో వాటిని ఆచూకీ చూపి పరిహారాన్ని నిలబెట్టారని రైతులు ఆర్డీవో ఎదుట ఆవేదన చెందారు. దీంతో ఆయన స్పందించి రికార్డులో జరిగిన తప్పులను పక్కనపెట్టి వారి దగ్గర ఉన్న ఆధారాలను పరిశీలించి పూర్వపు ఆధారాలను, అనుభవాలను చూసి వారికి పరిహారం ఇచ్చే విధంగా రికార్డులు సరిచేసి భూములను పరిశీలించి అందజేయాలన్నారు. ఎంతో కాలం క్రితం రైతులు రహదారి కోసం భూములను ఇస్తే ఇంతవరకు వారికి ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారాన్ని అందజేయకపోవడం రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యంగా కనబడుతుందన్నారు. ఇలాంటివన్నీ రెవిన్యూ అధికారులు సిబ్బంది వారి వారి పరిశీలన మేరకు నివేదికలో అందజేసి బాధిత రైతులకు భూ పరిహారం అందే టట్లు చూడాలన్నారు. ఇకపై ఆలస్యం జరిగితే రోడ్డు పనుల ఆటంకాలకు మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని తిరిగి ఇలాంటి సమస్యలు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. అదేవిధంగా ప్రతి సోమవారం నిర్వహించే పి జి ఆర్ ఎస్ పిటిషన్లు కూడా పదేపదే పునరావృత్తం అవుతున్నాయని అవి కోడూరు మండలం నుంచి అధికంగా ఉన్నాయని ఆయన తీవ్రస్థాయిలో తాసిల్దారిపై ఆగ్రహించారు. దీంతో తాసిల్దారు సిబ్బంది నీళ్ల నమిలే పరిస్థితి వచ్చింది. ఆర్డిఓ సుమారు మూడు నాలుగు గంటల పాటు కోడూరు నుంచి కుక్కలు దొడ్డి వరకు హైవే రోడ్డు పనులను పరిశీలించి, పరిహారం అందని భూ బాధిత రైతులతో మాట్లాడారు. ఈ నెలాఖరు లోపు మీ రికార్డుల తప్పుల పరకలను సరిచేసి మీకు పరిహారం అందించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## జమ్మి సుబ్రహ్మణ్యం రెడ్డి మృతి బాధాకరం..

రైల్వేకోడూరు రూరల్, జూన్ 13 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలంలోని సెట్టిగుంట పంచాయతీ అబ్బి నాయుడు పల్లి గ్రామానికి చెందిన జమ్మి సుబ్రహ్మణ్యం రెడ్డి ఆకస్మిక మృతి చెందడం చాలా బాధాకరమైన విషయమని రైల్వేకోడూరు వైసిపి సీనియర్ నాయకులు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ద్వాజారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సంద ర్భంగా సుబ్రహ్మణ్యం రెడ్డి కుటుంబ సభ్యు లను పరామర్శించి అండగా ఉంటామని ఆయన వారికి తెలియజేశారు. అదేవిధంగా మృతుడు తనకెంతో ముఖ్యమని అటువంటి సందర్భంలో సుబ్రహ్మణ్యం రెడ్డి మృతి చెందడం బాధ కలిగించిందని అతను ఆవేదనపడ్డాడు. అనంతరం ఆయన మృతదేహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బాబు నాయుడు, రెడ్డయ్య రెడ్డి, కే ఎస్ ఆర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు లారీ కిందపడి యువకుడు మృతి

రైల్వేకోడూరు రూరల్, జూన్ 13 (ప్రభాతవార్త)

రైల్వే కోడూరు మండలంలోని మైసూరువారిపల్లి పంచాయతీ రాజానగర్ వద్ద ఉన్న మామిడికాయల యార్డు వద్ద రవీంద్ర(20) అనే యువకుడు నిద్రపోతున్న సందర్భంలో లారీ చక్రాల కింద పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. అయితే ఈ ప్రమాదం ఎలా జరిగిందో అర్థం కాని స్థితిలో పోలీసులు విచారణ చేపట్టారు. అయితే ఈ ప్రమాదం మృతుడు మద్యం తాగి నిద్రపోతున్న సమయంలో లారీ డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడంతో ఈ సంఘటన జరిగి ఉండొచ్చని పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందినవారుగా గుర్తించారు. ఈ సంఘటనపై రైల్వేకోడూరు ఎస్సై లక్ష్మీ ప్రసాద్ రెడ్డి విచారం చేపట్టి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలియజేశారు.

## సర్ విధి విధానాలపై సిబ్బందికి అవగాహన.




చిట్వేలి, జూన్ 13, ప్రభాతవార్త:

భారత ఎన్నికల సంఘం చేపట్టిన సర్-2026 కార్యక్రమం విజయవంతంగా అమలుకు సంబంధించి, స్థానిక మండల కార్యాలయంలో శనివారం మండల ఎమ్మార్వో నరసింహారావు అధ్యక్షతన మండల పరిధిలోని బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తదుపరి ఎమ్మార్వో మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ2026 కార్యక్రమం యొక్క లక్ష్యాలు, విధివిధానాలు, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలపై సమగ్రంగా వివరించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావడం, మరణించినవారి పేర్లు మరియు ద్వంద్వ నమోదులను తొలగించడం, చిరునామా మార్పులు మరియు ఇతర సవరణలను నిబంధనల మేరకు ఖచ్చితంగా చేపట్టాలని బిఎల్ఓలకు సూచించారు. అలాగే ఓటరు జాబితాల స్వచ్ఛత మరియు పారదర్శకతను కాపాడేందుకు రాజకీయ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు కూడా ఎన్నికల ప్రక్రియలో చురుకుగా భాగస్వాములు కావాలని కోరారు.సమావేశంలో ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు, అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులను కచ్చితంగా పాటించాలని ఎమ్మార్వో సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని బూతు లెవల్ అధికారులు వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## మానవత కోడూరు శాఖ నూతన కార్యవర్గం

రైల్వేకోడూరు రూరల్, జూన్ 13 ప్రభాతవార్త



రైల్వేకోడూరులోని వేణుగోపాలస్వామి కళ్యాణ మండపంలో మానవత కోడూరు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్రం మానవత శాఖ కన్వీనర్ కే.రామాంజనేయులు రెడ్డి, మాజీ కడప జిల్లా మానవత అధ్యక్షులు సుబ్బారెడ్డి, రీజినల్ కమిటీ కన్వీనర్ రెడ్డన్న ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరి ఆధ్వర్యంలో 2026 27 కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో చైర్మన్‌గా కె.ప్రసాద్‌వర్మ కో-చైర్మన్గా వెంకటరమణ యాదవ్, కన్వీనర్‌గా ఏ శ్రీనివాసులు, అధ్యక్షులు ఆర్ చెంగల్ రెడ్డి,ఉపాధ్యక్షులు సుభాష్ బాబు,కార్యదర్శి నాగరాజు జాయింట్ కార్యదర్శి జోసెఫ్ తోపాటు మస్తాన్ సాహెబ్, మాధవ రాజు, ఉదయ శంకర్ రెడ్డి, యువరాజు చంద్రమోహన్ రాజు తదితరులు ప్రమాణ స్వీకారాన్ని చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రసాద్ వర్మ మాట్లాడుతూ ఈ నూతన కార్యవర్గం రానున్న రోజుల్లో మరింత చక్కటి సేవా కార్యక్రమాలను నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించి మానవత సంస్థ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని సంకల్పించారు.

## సమస్యల పట్ల అధికారులు స్పందించాలి

### ముక్కా రూపానంద రెడ్డి



రైల్వేకోడూరు రూరల్, జూన్ 13 ప్రభాతవార్త

రైల్వే కోడూరు నియోజకవర్గంలోనే ప్రజా సమస్యల పట్ల అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కార దిశగా పనిచేయాలని రైల్వే కోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపనంద రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు మండలంలోని రాఘవ రాజపురం గ్రామంలోని టిడిపి కార్యాలయంలో ప్రతివారం నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమాన్నికి వచ్చే ప్రజా సమస్యలను వేగవంతంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి మరల అర్జీదారులను తిప్పుకోకుండా పనిచేయాలని ఆయన సూచించారు. ఇప్పటికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని చేపట్టినప్పటి నుండి ఎన్నో రెవెన్యూ సమస్యలు మోలిక వసతుల పట్ల సంబంధిత అధికారులు వేగవంతంగా అర్జీదారులకు న్యాయం చేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొత్త పెన్షన్ల విధానాన్ని సంబంధిత అర్జీదారులకు అర్హతను బట్టి తప్పక ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. కూటమి అధికారం వచ్చినప్పటినుండి అర్జీదారులు ఎంతో ఆశతో ప్రజా దర్బార్ కార్యక్రమానికి వస్తున్నారని వారు ఆశలను ఓమ్ము చేయకుండా వచ్చిన ప్రతి ఒక అర్జీని పరిశీలించి బాధితులకు అండగా నిలవాలని ఆయన తెలియజేశారు. రానున్న రోజుల్లో ఫిర్యాదుదారులు మరల ప్రజాదర్బార్ కార్యక్రమానికి రాకుండా వారి సమస్యలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మంగంపేట నాయకుడు తల్లెం రమణారెడ్డి, బీసీ నాయకులు కమతం నాగరాజు, పటాన్ మోలా, జుబైర్, తిరుపతి శేఖర్, సుకుమార్ రెడ్డి, పసుపులేటి జయ చంద్ర, తిప్పన రాజశేఖర్ తోపాటు పలువురు టిడిపికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## భద్రతా నియమాలు పాటించాలి : ఎస్ఐ

చిట్వేలి జూన్ 13 ప్రభాతవార్త



రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో వాహనాలను నడిపే డ్రైవర్లు, రోడ్డుపై నడిచే పాదచారులు ఎవరైనా సరే రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే సురక్షి తంగా ఉంటారని, తద్వారా తమ కుటుంబం సుఖశాంతులతో జీవిస్తా రని పెనగలూరు ఎస్సై పి అరుణ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం బెస్తపల్లి కూడలిలో పలు వాహనాల డ్రైవర్లు సాధారణ ప్రజలకు ఆయన రోడ్డు భద్రత నియమాలు ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రజలు కొన్ని సార్లు రెప్పపాటులో చేసే పొరపాటు వల్ల ఆ భారం అంతా కుటుంబంపై పడుతుందన్నారు ఎవరో చేసిన పాపానికి ఇంకెవరో బలికావాల్సిన పొరపాటు జరిగిపోతుందన్నారు. ప్రతి ఒక్కరు అన్ని రకాల జాగ్రత్తలు నడుచుకుంటూ ఉంటే భరోసాతో సుఖ జీవనం సాగించవచ్చునన్నారు.

## జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరుకు వినతి

పెనగలూరు జూన్ 13 ప్రభాతవార్త

రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం జర్నలిస్ట్ లకు ఇంటి స్థలాలు మంజూరు చేయించాలని పెనగలూరు మండల పాత్రికేయులు రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, కుడా చైర్మెన్ ముక్కా రూపానందరెడ్డి కి వినతి పత్రం ఇచ్చారు. శనివారం ఉదయం రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముక్కా రూపానంద రెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పెనగలూరు మండలం విలేఖర్లు తమకు ఇంటి స్థలాలు మంజూరు చేయించాలని కోరారు. ఈ సంధర్భంగా ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారుల దృష్టికి సమస్యను తీసుకు వెళ్ళి జర్నలిస్ట్ లకు

## శ్రీసిటీలో ట్రైనీ ఐఏఎస్ అధికారులు



సత్యవేడు, జూన్ 13 ప్రభాతవార్త:

ఏపీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా 2025 బ్యాచ్‌కి చెందిన 8 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు శనివారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ పరిసరాలు, పారిశ్రామిక ప్రగతిని వీక్షించిన వీరు, స్థానిక ముండెలెజ్ పరిశ్రమను సందర్శించి ఉత్పత్తులు, ఇతర సాంకేతిక అంశాలను పరిశీలించారు. అనంతరం శ్రీసిటీ ప్రగతి, దినదిన అభివృద్ధి చెందిన శ్రీసిటీ నేటికీ ప్రపంచ స్థాయికి ఎదుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే జపాన్, ఇటలీ, ఆస్ట్రేలియా, చైనా, వంటిదేశాల రాయబారీలతోసుమారుగా 210 పరిశ్రమలుపైగా ఈ శ్రీసిటీ ఉన్నాయని తెలియజేశారు. ఇంకా ఈ శ్రీసిటీ అభివృద్ధి చెంది ప్రపంచ పథంలో ఓ గొప్ప తల మాణిక్యంగా నిలవాలని ముందుకు సాగుతున్నట్లు తెలియజేశారు.

## మత్తేరిమిట్టలో రెండు స్కూటర్లు ఢీ

### – ఇరువురికి గాయాలు

వరదయ్యపాలెం, జూన్ 13, ప్రభాతవార్త





వరదయ్యపాలెం మండలం శ్రీ సిటీ మత్తేరిమిట్ట గ్రామ పరిధిలో నేహా కిచెన్ సెంటర్ సమీపంలో శనివారం రెండు బైకుల ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనం సహాయంతో సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని స్థానికులు తెలిపారు.

## ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి




నాగలాపురం, జూన్ 13 ప్రభాతవార్త:

ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ నాగలాపురం మండల కార్యదర్శి మురుగేషన్ డిమాండ్ చేశారు. స్థానిక నాగలాపురం బస్టాండ్ ఆవరణలో ఆటోయూనియన్ మురుగేషన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగలాపురం మండల కేంద్రంలో 200 మంది ఆటో నడుపు కార్మికులు జీవిస్తున్నారని అత్యధిక మంది చదువుకున్న నిరుద్యోగులని, వేరే పనికి వెళ్లలేక ఆటో నడపడం జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నారని ప్రభుత్వ విధానాల వల్ల ఆటో కార్మికుల భవిష్యత్ చీకటిగా ఉందని విమర్శలు చేశారు. దీనికి తోడు రోడ్ల ధ్వంసం వలన ఆటో నడుపుతున్నప్పుడు రిపేర్లు ఎక్కువై సమయానికి తిండి తిప్పలు లేక కార్మికుల అనారోగ్య పాలవుతున్నారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి సక్రమమైన రోడ్డు మరాళ్ళన్ని ఏర్పాటుచేసి పెనాల్టీలుతగ్గించి ఆటోకార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా పింఛన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు జాకిర్, నాయకులు శాండి, అరుణాచలం, దక్షిణామూర్తి, ఆటోకార్మికులు పళణి, సురేష్, రాజా, సామ్యూల్, ఉమాపతి, వెంకటేష్, సెల్వ, పాండి, మహేష్, సాయికుమార్ పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నేడు 1000 మందికి వస్త్రదానం, అన్నదానం

తిరుపతి విద్య జూన్ 13 ప్రభాత వార్త



ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ కుమార్ మంగళం బిర్లా 59వ జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం తిరుపతిలో భారీ సేవా కార్యక్రమం నిర్వహించనున్నారు. కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ రోడ్డులో గల పి.సి.ఆర్ చాంబర్స్ లో మధ్యాహ్నం 12:00 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.ఈ సందర్భంగా దాదాపు 1,000 మంది నిరుపేదలకు, అట్టడుగు వర్గాల వారికి ఉచితంగా పౌష్టికాహారం (అన్నదానం) మరియు దుస్తులను పంపిణీ చేయనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ అండ్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పి.సి. రాయులు ఒక ప్రకటనలో తెలిపారు.

## పశువైద్య డిప్లొమా కోర్సు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి విద్య జూన్ 13 ప్రభాత వార్త




శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 202627 విద్యా సంవత్సరానికి గానూ రెండేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఇన్ యానిమల్ హజ్బెండ్రీ కోర్సు ప్రవేశాల ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును పొడిగించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఉన్న చివరి తేదీని ఈ నెల 15 నుండి జూన్ 20వ తేదీ వరకు పొడిగించినట్లు వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.పదో తరగతి ఉత్తీర్ణులైన అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రవేశాలు పూర్తిగా 10వ తరగతిలో సాధించిన మార్కుల (మెరిట్) ఆధారంగానే జరుగుతాయి. అర్హతలు, సీట్లు, ఫీజులు మరియు ఇతర పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## తిరుపతి ఫిల్మ్ సిటీ విజన్ పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి విద్య, జూన్ 13 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్‌లో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ (క్రియేటివ్ ఎకానమీ ) అభివృద్ధిలో భాగంగా ప్రతిపాదిత తిరుపతి ఫిల్మ్ సిటీ విజన్ పోస్టర్‌ను రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. పారడాక్స్ పిక్చర్స్ వ్యవస్థాపకురాలు, నిర్మాత కావ్య శనివారం మంత్రిని కలిసి తిరుపతిలో సినీ మోలిక వసతుల అభివృద్ధి పురోగతిని వివరించారు.ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ఏపీలో స్వయం సమృద్ధిగల సినీ పరిశ్రమను నిర్మించడమే తమ లక్ష్యమన్నారు. గత రెండేళ్లుగా తిరుపతిలో 4 ఎకరాల విస్తీర్ణంలో చిత్ర నిర్మాణం, ఎడిటింగ్ సూట్లు, డబ్బింగ్, రికార్డింగ్, సంగీత నిర్మాణ కేంద్రం వంటి అత్యాధునిక పోస్ట్‌ప్రొడక్షన్ సౌకర్యాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రోజుకు 4 సినిమాల నిర్మాణానికి సరిపడా ఏఆర్‌ఆర్ఐ కెమెరాలు, క్రేన్లు, లైటింగ్ పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం పూర్తిగా తిరుపతిలోనే రెండు చిత్రాల షూటింగ్ జరుగుతోందని,స్థానిక యువతకు సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ వంటి విభాగాల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు క్రియేటివ్ ఎకానమీ విజన్‌కు అనుగుణంగా పారడాక్స్ పిక్చర్స్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు రాకముందే ప్రైవేట్ రంగంలో ముందడుగు వేసి మోలిక వసతులు కల్పించడం గర్వకారణమన్నారు. ఈ ప్రాజెక్ట్ వేగంగా కార్యరూపం దాల్చేందుకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## చిరుజల్లుల మధ్య గోవింద నామస్మరణల నగరసంకీర్తన



తిరుపతి, జూన్ 13ప్రభాతవార్త:

పవిత్రక్షేత్రమైన తిరుపతి నగరం ప్రతి శనివారం ఉదయం భక్తిరసంలో మునిగిపోతూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంటోంది. వేంకటేశ్వర స్వామి కృప నగరమంతా విస్తరించాలని సంకల్పంతో భజన మండలి సభ్యులు శనివారం ఉదయం చిరుజల్లుల మధ్య నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయ స్వామి గుడి వద్దకు ఉదయం ఐదు గంటలకు చేరుకుని, మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య నగర సంకీర్తన ప్రారంభమైంది."గోవింద.. గోవింద.." అనే నామస్మరణతో మారుమోగే తిరుపతి వీధులు ఆధ్యాత్మిక కాంతిని ప్రసరించాయి. శనివారం ఉదయం చిరుజల్లుల మధ్య అత్యంత ఆహ్లాదకరంగా నగర సంకీర్తన జరిగింది. ఈకార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు మునినాథరెడ్డి, వాసుదేవ రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, అన్నూరు మునిరత్నమాచారి, పురుషోత్తమ యాదవ్, మధుసూదన్, నాగేశ్వరరెడ్డి, రాజేంద్రన్, ఏ నాగరాజ రెడ్డి, రామచంద్ర రాజు, కొండే చెంగారెడ్డి, పలని ఆచారి, తిరుపాల చారి, భాస్కరాచారి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, అరుణమ్మ, జయమ్మ,విజయ కుమారి, అమరావతి, రేవతి,ఉమా జి పద్మ, వై పద్మావతి, సిద్ధమ్మ, పార్వతి, జ్యోతి, ధనమ్మ,శ్రావణి,నాగరాజామ్మ, పద్మావతి, కళ్యాణి సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి

### -విశ్రాంత ఉద్యోగుల సంఘం

తిరుపతి, జూన్ 13 ప్రభాతవార్త:




ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని 12 వ పే రివిజన్ కమిషన్ ను ఏర్పాటు చేసి వెంటనే ఐ. ఆర్. ను ప్రభుత్వం ప్రకటించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం తిరుపతి నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కే. ఆర్. శంకర్, టి. వెంకటేశం శెట్టి డిమాండ్ చేశారు. శనివారం ఉదయం బాలాజీ కాలోనీ లోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నెలవారీ సమావేశం సంఘం అధ్యక్షుడు కె ఆర్ శంకర్ అధ్యక్షతన జరిగింది. కూటమి ప్రభుత్యం వచ్చిన తరువాత జూలై 24 నుండి ఈ ఏడాది జనవరి 26 వరకు నాలుగు డి. ఆర్. లు బకాయి లు వెంటనే ప్రకటించాలని, 11 వ పి ఆర్ సి బకాయిలు చెల్లించాలని, 12 వ పి ఆర్ సి నియామకం చేసి వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని, పే రివిజన్ ఆలస్యం వలన పెన్షనర్స్ ఆర్థికంగా నష్ట పోతున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్థానిక టాటా క్యాన్సర్ కేర్ ఆసుపత్రి నుండి వచ్చిన వైద్యులు డాక్టర్ మస్తాన్ సాహెబ్, క్యాన్సర్ కు సంభందించి అవగాహన కలిగించారు. ముఖ్యంగా నోరు, రొమ్ము, గర్భాశ య క్యాన్సర్, లు తొలి దశలో ఎలా గుర్తించాలన్న విషయాలను వివరించారు మెడికల్ సిబ్బంది నోరు, రొమ్ము క్యాన్సర్ కు సంభందించి ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు.సమావేశంలో సంఘం వైస్ ప్రెసిడెంట్ టి. గోపాల్, టి వి రమణ, మునికృష్ణ సంఘం కార్య వర్గ సభ్యులు పుల్లయ్య, మెహరున్నీ, భాగ్యలక్షి మవిశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఈ సమావేశం లో పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**రామచంద్రాపురం, జూన్ 13 ప్రభాతవార్త:**

రోడ్డు ప్రమాదంలో పివి సపార్లకు చెందిన యువకుడు బి.అనిల్‌కుమార్ (31) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మృతుడు తిరుపతి నుండి స్వగ్రామం పివి సపార్లుకు గుండోడు కనుమ రహదారిలో వస్తుండగా భాస్కర్ నాయుడు మామిడితోట వద్ద ఇద్దరు యువకులు రహదారికి అడ్డంగా ద్విచక్రవాహనాన్ని పార్క్ చేసి మద్యం సేవిస్తున్నారని అన్నారు. రాత్రి సమయంలో రోడ్డుపై వున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొని అదుపుతప్పి బండరాయిని ఢీకొట్టుకోవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. శనివారం మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ భక్తవత్సలం కేసు నమోదు చేసి దర్యాప్తు చసేఞ్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

## ఎస్ఐఆర్‌కు సహకరించండి.!

**తహశీల్దార్ మధుసూదన్ రావు**

**రామచంద్రాపురం, జూన్ 13 ప్రభాతవార్త:**



ఎస్ఐఆర్(సర్)కు ఓటర్లు సహకరించాలని తహశీల్దార్ మధుసూదన్‌రావు కోరారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15 నుండి జూలై 15 వరకు ఎస్ఐఆర్ 2026 కార్యక్రమాన్ని నిర్వహిస్తారని అన్నారు. బిఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్ళి రెండు ఎమ్యునిరేషన్ పత్రాలను అందజేస్తారని, అందులో పొందుపరచిన వివరాలను పరిశీలించి తప్పులు ఏవైనా వున్నట్లయితే సవరించి, బిఎల్ఓలకు అందజేయాలన్నారు. ఒకే కుటుంబంలోని ఓటర్లను ఓటరు లిస్ట్‌లో ఒకే ప్రదేశంలో పొందుపరచడానికి అనుగుణంగా వుంటుందన్నారు. 40 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని 40 మంది బిఎల్ఓలు మండలంలోని 26,052 మంది ఓటర్లను కలుస్తారని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్ఏలకు సోమవారం 11 గంటలకు ఎంపిడిఓ కార్యాలయంలో ఓటకరు జాబితాపై అవగాహన కల్పిస్తామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## త్రిపుల్ ఐటికి కెకెవి పురం విద్యార్థిని ధరణి ఎంపిక



**రామచంద్రాపురం, జూన్ 13 ప్రభాతవార్త:**

ఒంగోలులోని త్రిపుల్ ఐటికి కెకెవి పురం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని పి.ధరణి ఎంపికైనట్లు ఎంఈఓ మార్కొండయ్య నాయుడు తెలిపారు. శనివారం ఆయన రామచంద్రాపురంలో విలేకరులతో మాట్లాడుతూ గత మార్చిలో జరిగిన 10 పరీక్షలలో ధరణి 575 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందన్నారు. ఈ నేపథ్యంలో ఆమెకు ఒంగోలులోని త్రిపుల్ ఐటిలో సీటు లభించిందన్నారు. ఈ సందర్భంగా కెకెవి పురం ప్రధానోపాధ్యాయుడు భాస్కరయ్య, టీచర్లు విద్యార్థిని అభినందించారు.

## తమిళనాడుకు ఆక్రమంగా తరలిస్తున్న ఎద్దుల లారీని పట్టుకున్న పోలీసులు

**నింద్ర, జూన్ 13 ప్రభాతవార్త :**



తుని నుండి తమిళనాడుకి శనివారం ఆక్రమంగా 37 ఎద్దెలను తరలిస్తుండగా నగరి రూరల్ సిఐ భాస్కర్,నింద్ర యస్ఐ మల్లిఖార్జున్ పట్టుకున్నారు. నగరి రూరల్ సిఐ భాస్కర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా యస్‌పి తూషార్ డూడి,నగరి డియస్‌పి జె.రాంబాబు వారి ఆదేశాల మేరకు అందిన సమాచారంపై మండలంలోని తిరుపతి చెన్నై జాతీయ రహదారిపై అనుమానస్పదంగా ప్రయాణిస్తున్న కంటైనర్ లారీ తనిఖీ చేయగా, అందులో 37 ఎద్దులను అక్రమంగా తమిళనాడు రాష్ట్రానికి కళేబారాలకు, తరలించి ఎక్కువ రేటుకి అమ్ముతారని తెలిపారు. తరలిస్తున్న ఎద్దులకు ఎలాంటి అనుమతులు లేదని గుర్తించామని తెలిపారు. పోలీసులను గమనించిన లారీ డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి తప్పించుకోవడానికి ప్రయత్నం చేసారు. ఈ సమయంలో యస్ఐ మల్లీఖార్జున్,పోలీసు బృందం అప్రమత్తంగా చాకచక్యంగా వారిని పట్టుకున్నారు.ఆక్రమంగా తరలిస్తున్న ఎద్దులు తుని పరిసర ప్రాంతాలలోనే రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని ఎక్కువ ధరకు విక్రయించుకుంటారని తెలిపారు. డ్రైవర్ వద్ద నుంచి కంటైనర్‌తో పాటు,రెండువేల రుపాయలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.



## వీధిలైట్లకు ఆఫ్ఆన్ స్విచ్‌లు ఏర్పాటు చేయండి

**పుత్తూరు రూరల్, జూన్ 13 ప్రభాతవార్త:**

పుత్తూరు పట్టణంలోని వీధిలోని పలు చోట్ల వీధిలైట్లకు, ఆఫ్ ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. అనేక మార్లు మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పట్టణ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## బ్యాంకు అధికారుల కొత్త నిబంధనలతో రైతుల ఇబ్బందులు

**గోల్డ్‌లోన్ల రెన్యువల్స్ నిలిపివేతపై ఆగ్రహం**

**అసలు, వడ్డీ మొత్తం చెల్లిస్తేనే బంగారం విడుదల**

**సత్యవేడు, జూన్ 13 ప్రభాతవార్త:**

సత్యవేడు స్టేట్ బ్యాంక్ అధి.కారుల వ్యవహార శైలిపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తు న్నారు. పంటల సాగు కోసం బంగారాన్ని తాకట్టు పెట్టి గోల్డ్ లోన్లు తీసుకున్న రైతులకు, గడువు ముగిసిన తరువాత రెన్యువల్ సౌకర్యాన్ని నిరాకరి స్తుండడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకు అధికారులు, ఆర్‌బీఐ కొత్త నిబంధనలు అంటూ అసలు వడ్డీ మొత్తాన్ని పూర్తిగా చెల్లించి రుణం క్లియర్ చేసుకున్న తరువాతే బంగరాన్ని విడిపించుకోవాలని చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లోని స్టేట్ బ్యాంక్ శాఖల్లో గోల్డ్ లోన్లకు రెన్యువల్ సౌకర్యం కొనసాగుతుండగా, సత్యవేడు శాఖలో మాత్రం ఆ అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారని వారు వాపోతున్నారు. గోల్డ్ లోన్ తీసుకునే సమయంలో రెన్యువల్ సౌకర్యం ఉండదని ఎవరూ చెప్పలేదని రైతులు అంటున్నారు. ఇప్పుడు రెన్యువల్ కోసం వెళ్లితే అసలు, వడ్డీ మొత్తం చెల్లించాలంటూ సిబ్బంది ఒత్తిడి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గడువు ముగిస్తే బంగారాన్ని వేలం వేస్తామని హెచ్చరిస్తున్నారని రైతులుచెబుతున్నారు. రైతులకు ఫోన్‌లు చేసి మరీ ఎన్నిసార్లు చెప్పాలి, అసలు, వడ్డీ చెల్లించి లోన్ క్లోజ్ చేయండి, రెన్యువల్ అవకాశం లేదంటూ సిబ్బంది కఠినంగా చెబుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు స్పందించకపోవడం బాధాకరమని రైతులు అంటున్నారు. బ్యాంకు అధికారుల నిర్ణయాలు నిజంగా ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారమేనా, లేక స్థానికంగా తీసుకున్నవేనా అన్న విషయంపై స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇతర సేవలపై అసంతృప్తి బ్యాంకులో డీడీలు పొందేందుకు నగదు తీసుకెళ్లినా అంతా ఆన్‌లైన్ నో క్యాష్ అంటూ తిరస్కరిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. రైతులు, ఖాతాదారుల సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మెడికల్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి




**సత్యవేడు, జూన్ 13 ప్రభాతవార్త:**

సత్యవేడు పట్టణ పరిధిలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతూ మెడికల్ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో ప్రైవేటు మెడికల్‌షాపుల దందాలు రోజు రోజుకు పెరుగుతూ ప్రజల ఆరోగ్యాన్ని వ్యాపారంగా మార్చిన మెడికల్ మాఫియాపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు అనారోగ్యంతో ఆస్పత్రులకు వెళ్లితే, మందుల పేరుతో అధిక ధరలు వసూలుచేసి దోపిడీ చేస్తున్నారని రోగుల ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మందిమెడికల్ షాపుల యాజమాన్యాలు నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శలు ఉన్నాయి. ప్రజలకు నాణ్యమైన మందులు సరసమైన ధరలకు అందేలా అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని, అక్రమాలకు పాల్పడుతున్న మెడికల్ షాపులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరారు. ఆరోగ్యరంగంలో అవినీతి, దోపిడీకి అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వం విఫలమైతే ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## సైబర్ నేరాలపై అవగాహన



**తిరుపతి, జూన్ 13ప్రభాతవార్త:**

మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగం, అత్యవసర సహాయ నంబర్లపై మహిళలకు చైతన్యం కలిగిస్తున్నారు మహిళ పోలీసులు. చిన్నారులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల భద్రతపై అవగాహన కల్పించారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు సైబర్ నేరాలతో పాటు నేటి సమాజంలో జరుగుతున్న వివిధ రకాల నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో శక్తి టీమ్ సిబ్బంది విద్యార్థులు, మహిళలు, చిన్నారులను చైతన్యపరిచారు. మహిళలు, చిన్నారులపై ఇటీవల సమాజంలో చోటుచేసుకున్న ఘటనలు ,కేస్ స్టడీల ద్వారా ప్రజలకు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు ,అత్యవసర సేవల నంబర్లపై అవగాహన కల్పించారు.ఏదైనా అనుమానాస్పద ఘటన గమనించిన వెంటనే పోలీసులకు 112 అత్యవసర సహాయ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

## న్యాయవాది డిగ్రీ పూర్తి చేసి ఎదురు చూస్తున్న వారికి 15 నుంచి ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభం

**తిరుపతి(లీగల్), జూన్ 13 ప్రభాతవార్త:**

న్యాయవాది డిగ్రీ పూర్తి చేసి ఎదురు చూస్తున్న వారికి జూన్ 15 నుంచి ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ఒక ప్రకటన విడుదల చేసింది.ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్, కౌన్సిల్ ఎన్నికల కారణంగా గత డిసెంబర్ 29 నుంచి నిలిచిపోయిన ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాలను తాత్కాలిక ఎన్‌రోల్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో పునఃప్రారంభించనున్నట్లు న్యాయవాద పట్టభద్రులకు ఓ తీపి కబురు అందజేసింది. ఈ మేరకు బార్‌కౌన్సిల్ కార్యదర్శి శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు. జూన్ 15 నుంచి ప్రతి సోమవారం, మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఎన్‌రోల్‌మెంట్ దరఖాస్తులు జారీ చేయనున్నారు. అలాగే పూర్తిగా నింపిన దరఖాస్తులను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి వరకు స్వీకరించనున్నారు. రోజుకు 150మంది అభ్యర్థులకు మాత్రమే ఫస్ట్ కమ్-ఫస్ట్ సర్వ్ విధానంలో దరఖాస్తులు అందజేయనున్నట్లు బార్ కౌన్సిల్ స్పష్టం చేసింది. ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు బార్ కౌన్సిల్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తులు స్వీకరించబడవని వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా న్యాయ విద్య పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బార్ కౌన్సిల్ కోరింది. ఈ నిర్ణయంతో ఎన్‌రోల్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్న న్యాయ పట్టభద్రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

## పులిచెర్ల మండలం నుంచి నలుగురి విద్యార్థినీలు త్రిబుల్ ఐటీకి ఎంపిక

**పులిచెర్ల, జూన్ 13, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన త్రిబుల్ ఐటీ మెరిట్ జాబితాలో పులిచెర్ల మండలం నుంచి నలుగురు విద్యార్థినీలు ఎంపికయ్యారు.. పులిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి రోషిని, జోష్మిత, కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గౌతమి, మేఘన, ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినీలను ఎంఈఓ సిద్ధరామయ్య, పోకల తాతయ్య హెచ్ఎంలు లక్ష్మిదేవి, శ్రీవాణి సీఆర్పీలు మునీర్ అహ్మద్ వేణుగోపాల్, మునీశ్వర, సిఓ ఇంతియాజ్ అహ్మద్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ గోవర్ధన్ అభినందించారు.

## ఓటర్ల జాబితా తయారీకి బూత్ లెవల్ ఏజెంట్లు సహకరించాలి

**..నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి శారదా దేవి**

**తిరుపతి కార్పొరేషన్, జూన్ 13, ప్రభాతవార్త**



167 తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలోని బూత్ లెవల్ ఏజెంట్లందరూ పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి శారదా దేవి కోరారు. ఖిస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026ఖిలో భాగంగా, గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లతో శనివారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో అవగాహన సదస్సు (ఓరియంటేషన్ వర్క్‌షాప్) నిర్వహించారు. ఈ సమావేశంలో బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక సమగ్ర సవరణ అంటే ఏమిటి, దాని ఆవశ్యకత, ఉద్దేశం మరియు అందులోని వివిధ ప్రక్రియలను క్షుణ్ణంగా వివరించారు. అలాగే, ప్రస్తుతం జరుగుతున్న ఎలక్టార్ మ్యాపింగ్, ఎస్.ఐ.ఆర్ షెడ్యూల్, ఎన్యూమరేషన్ (గణన) దశతో పాటు, ఈ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్ల కీలక పాత్ర గురించి అవగాహన కల్పించారు. వంద శాతం పారదర్శకమైన, స్వచ్ఛమైన తుది ఓటర్ల జాబితా తయారీకి ఏజెంట్లందరూ తమ వంతు సహకారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.అన్నీ రాజకీయ పార్టీలు తమకు సంబందించిన బూత్ లెవల్ ఏజెంట్ల యొక్క నియామకమును నిర్ధేశించిన ఫార్మాట్ నందు ఆఫీసుకు రెండు రోజులలో సమర్పించాలని కోరడమైనది. ఎనుమేరేషన్ ఫారం నందు ప్రస్తుత ఓటరు యొక్క లేటెస్ట్ పాస్ పోర్ట్ సైజు కలర్ ఫోటో సేకరించి తీలీవీ లకు అందజేయాలని కోరారు. అనంతరం బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక సమగ్ర సవరణపై వ్యక్తం చేసిన పలు సందేహాలు, అనుమానాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ సమావేశంలో సహాయ ఓటర్ల నమోదు అధికారులు అమరయ్య, వి.సురేష్ బాబు, ఎన్నికల ఉప తహశీల్దార్ సుధాకర్ నాయక్ మరియు అన్ని రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## గ్లోబల్ ట్రీ బ్యాంక్ సంస్థ ఆధ్వర్యంలో చెట్లు నాటే కార్యక్రమం

**నాగలాపురం, జూన్ 13 ప్రభాతవార్త:**




నాగలాపురం మంలంలోని పలు గ్రామాల్లో చెట్లు నాటు కార్యక్రమాన్ని ఆ సంస్థ అధినేత జాన్సన్ నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్లోబల్ ట్రీ బ్యాంక్ ఆధ్వర్యంలో నాగలాపురం మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా(సీఎస్ఐ) ప్రాంగణాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడింది. జాన్సన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ సంస్థ ద్వారా కొన్ని వేల చెట్లను గ్రామాల్లో నాటడం జరిగిందని, ఏ మండలానికైనా ఎవరికైనా చెట్లు కావలసి నట్లయితే ఉచితంగా తమ ప్రాంతానికి అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్మల, సుబ్రహ్మణ్యంరాజు, పాస్టర్ శాంసన్‌రాజ్‌కుమార్, రాజేశ్వరన్, ఆదికేశవులు, వెంకటేశన్, విశ్వాసులు పాల్గొన్నారు.

## సీనియర్ టిడిపి నాయకులన్ని పరామర్శించిన ఎమ్మెల్యే తనయుడు



**నారాయణవనం, జూన్ 13 ప్రభాతవార్త :**

మండలంలోని బొబ్బరాజుపాలెం గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ ఎంపిటిసి సుబ్రమణ్యం కొద్దిరోజుల క్రితం ప్రమాదానికి గురైనారు. ఇటీవల ఇంటికి రావడంతో సమాచారం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ శనివారం పరామర్శించారు. పూర్తి ఆరోగ్యంతో కోలుకొని మళ్లీ ప్రజాసేవలోకి రావాలని కోరారు. ఆయనతో పాటు టిడిపి మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, నాయకులు అచ్చుకట్ల హరి, మాణిక్యంరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కళ్యాణ వేంకటేశ్వరుని ఊంజల్‌సేవ



**నారాయణవనం, జూన్ 13 ప్రభాతవార్త :**

నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, సాంబయ్య, మోహన్, మూర్తి, మురళి, అర్చకులు పాల్గొన్నారు.

## పరాశరేశ్వరుని బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

**నారాయణవనం, జూన్ 13 ప్రభాతవార్త :**

మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ వెలసిన టిటిడి అనుబంధ ఆలయం చంపకల్లీ సమేత పరాశరేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి ఆదివారం సాయంత్రం అంకురార్పణ కార్యక్రమం జరగనుంది. నేడు సాయంత్రం అంకురార్పణ, 15వతేది సోమవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభంకానున్నది. ఈ ఉత్సవాలను టిటిడి ఘనంగా నిర్వహించడ ం కోసం ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. ఆలయానికి వెళ్ల కొట్టడం, చలువపందేళ్లు, విద్యుత్ కటౌట్లు, తోరణాలు కడుతున్నారు..

## ఆర్‌పియఫ్ కమిటి గౌరవ అధ్యక్షులు క్రిష్ణయ్య



**నింద్ర, జూన్ 13 ప్రభాతవార్త :**

ఉమ్మడి చిత్తూరుజిల్లా రాయల్ పిపుల్ ప్రంట్ కమిటి సంఘం గౌరవ అధ్యక్షలుగా కె.క్రిష్ణయ్యరాయల్‌ను నియమించినట్లుగా రాయల్ పిపుల్ ప్రంట్ కమిటి జాతీయ అధ్యక్షులు రెడ్డిశేఖర్ రాయల్ తెలిపారు.ఈసందర్భంగా క్రిష్ణయ్య మాట్లాడుతూ ఆర్‌పియఫ్ కమిటి సభ్యులు నాపై నమ్మకంతో ఈపదవిని కట్టబెట్టిన వారికి కృతజ్ఞత తెలిపారు.నేను యెల్లవేళల కాపులకు అండగా వుంటూ వారి సమస్య వచ్చినప్పుడు వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తాను అన్నారు.కార్యక్రమంలో గోపిరాయల్,కన్నివేలురాయల్,తదితరులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై "దేవేరులతో శ్రీనివాసుడు"



**చంద్రగిరి, జూన్ 13 ప్రభాతవార్త:**

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీనివాసుడు తన దేవేరులతో తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్‌అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు కె.ఎస్.రాజు, జమేధర్ కేశవరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిరోజు వ్యాయామం, సమతుల్య ఆహారంతో మంచి ఆరోగ్యం

**-డాక్టర్ సుకుమార్**

**తిరుపతిహెల్త్,జూన్ 13ప్రభాతవార్త:**



ప్రతి మనిషి తన జీవితంలో ఆరోగ్యం కోసం శ్రద్ధ తీసుకున్నప్పుడే జబ్బుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని, ప్రతిరోజు ఉదయం వ్యాయామంతో పాటు సమతుల్య ఆహారం తీసుకుంటే షుగర్, బిపి జబ్బుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని సాయి సుధా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత డాక్టర్ బి.సుకుమార్ తెలియజేశారు. ఆరోగ్యమే మహాభాగ్యం నినాదంతో డాక్టర్ సుకుమార్ఆధ్వర్యంలో రెడ్డి రెడ్డి కాలనీలోనిసాయి సుధా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో రాళ్లపల్లి రాఘవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సీనియర్ సిటిజన్స్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరం లో డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూఈ వైద్య శిబిరంలో సుమారు 50 మందికి పైగా షుగర్, బిపి కీళ్ల నొప్పులకు ఉచితంగా పరీక్షలు చేసి సూచనలు సలహాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు, ఫిజియోథెరపీ డాక్టర్ సునీత, సుజాత, మహేష్,హేమంత్,ప్రవీణ్, సిస్టర్స్ బిందు,నీలిమ,శ్రీలత, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## వ్యక్తి మృతదేహం ఆచూకీ లభ్యం



బుచ్చినాయుడు కండ్రిగ జూలై 13 ప్రభాతవార్త : మండలంలోని కాటూరు గ్రామానికి చెందిన నెల్లటూరు అక్కులయ్య, వయస్సు (66) గుర్తు తెలియని కేసుకు సంబంధించి మృతదేహం లభించినట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు బుచ్చినాయుడు కండ్రిగ మండలం కాటూరు గ్రామంలోని నెలటూరు అక్కులయ్య సంబంధించి గురువారం కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కనబడుటలేదనే కేసు నమోదు చేశారు. కాటూరు హరిజనవాడ గ్రామం, బుచ్చినాయుడుకండ్రిగ మండలం, తన ఇంటి వద్ద ఉన్న నాలుగు బర్రెలను తీసుకొని తెలుగు గంగ కాలువ ప్రక్కన ఉన్న పొలాల వద్ద మేపుకొని వస్తానని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు పరిసర ప్రాంతాలలో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో, ఈ నెల 12 తారీఖున పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తులో భాగంగా 13వ తారీకు బుధవారం సాయంత్రం ఆరు గంటలకు 13తేదీ ఉదయం కాళింగి సమీపంలోని ఒక గుంటలో అక్కులయ్య మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అక్కులయ్య మృతదేహం గుర్తించి బంధువులకు సమాచారం ఇవ్వడం జరిగిందని ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తునట్లు తెలిపారు.

## స్కూల్ విద్యార్థుల అవస్థలు



ఏర్పేడు జూన్ 13 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మడిబాక గ్రామ పంచాయతీ రాజులకండ్రిగ గ్రామం లోని ఆదర్శ పాఠశాల గ్రామ పరిసరాల్లో దోమల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల సమీపంలో ఉన్న కాలువలో మురుగు నీరు నిలిచిపోయి, పిచ్చి మొక్కలు పెరిగి దోమలకు ఆవాసంగా మారింది. ప్రధాన సమస్యలు: పాఠశాల ప్రక్కనే మురుగు కాలువలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి నీరు నిల్వ ఉంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగాయి. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం: పగటిపూట కూడా దోమలు కుడుతుండటంతో విద్యార్థులు పాఠాలపై దృష్టి పెట్టలేకపోతున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు, మండల విద్యాశాఖ అధికారులకు చరవాణి ద్వారా ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. వెంటనే కాలువను శుభ్రం చేయించి, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. పాఠశాల పరిసరాల్లో బ్లీచింగ్ చల్లి, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున అధికారులు తక్షణమే స్పందించి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యశాఖ, పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై...పిల్లలకు అవగాహన

శ్రీకాళహస్తి రూరల్,జూన్ 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎర్రమరెడ్డిపల్లి గ్రామంలో బాలల సంఘం పిల్లలకు ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక నిర్మూలన వ్యవస్థపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల సంఘం పిల్లలను ఉద్దేశించి క్రమం తప్పక పాఠశాలకు రావాలని కనీసం 18 సంవత్సరాలు నిండే వరకు పాఠశాల కళాశాల విద్య పూర్తి చేయాలని భవిష్యత్తులో అభివృద్ధి సాధించాలంటే విద్య తప్పనిసరి అని తెలిపారు. బాల కార్మికులు ఏర్పడకపోతే సమాజం అభివృద్ధి వైపు నడుస్తుందని తెలిపారు పిల్లలనే బాల కార్మిక వ్యవస్థలో ఏర్పడే కష్టనష్టాలు చదువుకుంటే భవిష్యత్తు అభివృద్ధి దశలో వయస్సొచ్చిన లేకుంటే అన్ని సమస్యలు ఎదుర్కోవాలని తెలిపారు. బాలల సంఘం పిల్లలు బాల కార్మిక వ్యవస్థపై అనేక సందేహాలు సమస్యలను తెలుసుకుని నష్టాలు వస్తాయని చదువుకుంటే బంగారు భవిష్యత్తు మాదేనని వారు తెలిపారు. చిన్నతనంలోనే విద్యకు దూరమైతే భవిష్యత్తు అంధకారమని వారు చార్టర్ రూపంలో బాల కార్మిక వ్యవస్థపై బాల హక్కులపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ కో కన్వీనర్ రామచంద్ర బాలల సంఘం పిల్లలు పాల్గొన్నారు.

## ఋతుపవనాల రాకతో మొదలైన వర్షాలు

### వేరుశనగ సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్నలు

కుప్పం ,జూన్ 13 ప్రభాతవార్త : జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో వాతావరణం చల్లబడింది. ఈ ఏడాది ముందు నాలుగు రోజులు ఆలస్యంగా రుతుపవనాలు వచ్చాయి. ఋతుపవనాల ప్రభావంతో ప్రస్తుతం మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఏటా ఖరీఫ్ సీజన్ లో రైతులు వర్షాధార పంట అయిన వేరుశనగ పంట సాగును అధికంగా చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న మోస్తారు వర్షాలతో భూమిలో తేమ కలగడంతో రైతులు దుక్కులు దున్నేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం సైతం రైతులకు రాయితీతో సబ్సిడీ వేరుశనగ విత్తనాలను అందించేందుకు సిద్ధమయింది. ఇప్పటికే వేరుశనగ విత్తనాలు ఆయా మండల కేంద్రాలకు చేరుకున్నాయి. సకాలంలో విత్తనాలు సైతం రావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భూమిలో దుక్కులు దున్నుతున్న రైతన్నలు వేరుశనగ పంట సాగు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఏది ఏమైనా దాదాపు నాలుగు నెలల కాలం పాటు ప్రజలను ఎండలతో ఉక్కిరి బిక్కిరి చేసిన వాతావరణం ప్రస్తుతం చల్లగా మారి వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు కూడా ఉపశమనం పొందుతున్నారు.

### ఖేత్ బచావో అభియాన్...

## పోస్టర్‌ను విడుదల చేసిన మంత్రి అచ్చెన్న



తిరుపతి కలెక్టరేట్, జూన్ 13 ప్రభాతవార్త : రాస్ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.వెంకటరత్నం, రాస్-కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసులు ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.నాగరాజులు శనివారం వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చం నాయుడు ని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. మంత్రివర్యులను పుష్పగుచ్చం మరియు శాలువా తో సత్కరించడం జరిగింది.ఈ భేటీలో రాస్ చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు మరియు కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా జిల్లా రైతాంగానికి అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది. అలాగే ప్రస్తుత కేవీకే వారు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అమలు చేస్తున్న ఖేత్ బచావో అభియాన్ (పంట సంరక్షణ కార్యక్రమం) గురించి మంత్రి కి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాస్ - కృషి విజ్ఞాన కేంద్రం వారు ప్రచురించిన ఖేత్ బచావో అభియాన్" (పంట సంరక్షణ కార్యక్రమం) పోస్టర్ ను మంత్రి వర్యుల చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా సమతుల ఎరువుల యాజమాన్యం చేపట్టాలని, విలువనుసరించి రసాయనిక ఎరువులను తగ్గించి ప్రత్యామ్నాయ ఎరువులైన సేంద్రియ ఎరువులు, పచ్చి రొట్ట ఎరువులు, జీవన ఎరువులు వాడి నేల ఆరోగ్యాన్ని కాపాడి నాణ్యమైన దిగుబడులు పొందాలని సూచించారు. ఆ దిశగా రైతులను చైతన్య పరిచేదిశగా ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లేలా కృషి విజ్ఞాన కేంద్రాలు కీలక పాత్ర పోషించాలని కోరారు.

## శేషాద్రికి కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డ్



తిరుపతి కల్చరల్, జూన్ 13 ప్రభాతవార్త: ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు డాక్టర్ కొమాండూరి శేషాద్రి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు లభించింది. సీనియర్ కళాకారులు, లక్ష్య లక్షణ కారులు, పరిశోధకులు, ఉపన్యాసకులు, వాగ్గేయకారులుగా ఆయన శాస్త్రీయ కర్ణాటక సంగీతంలోని పలు విభాగాల్లో తనదైన ముద్రవేశారు. తిరుపతిలోని ఎస్వీ సంగీత నృత్య కళాశాలలో పాటు, ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలోని అన్ని సంగీత కళాశాలల్లో ఆయన ప్రిన్సిపాల్ గా పనిచేశారు. ప్రఖ్యాత విద్వాంసులకు వయొలిన్ వాద్య సహకారం అందించారు. వయొలిన్ తో పాటు వయోలా వాద్యంలో కూడా ఏ గ్రేడ్ కళాకారునిగా గుర్తింపు పొందారు. సంగీతానికి సంబంధించి, వందకు పైగా పరిశోధనా వ్యాసాలను తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రచురించి ఆయన ప్రత్యేకతను చాటుకున్నారు. పలు అన్నమాచార్య, పురందరదాస, వెంకటేశ్వర స్వామి కీర్తనలను స్వరపరిచి, బహుళ ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. గోష్టియ, వత్స, చంద్ర హాసిత, శేఖర చంద్రిక వంటి అపూర్వ రాగాలు సృష్టికర్తగా పేరుపొందారు. పదవేలకు పైగా శతకాలు, కీర్తనలను రచించారు. నాథ నిధి, సంగీత సరస్వతి, లక్ష్య లక్షణ కోవిద వంటి అనేక బిరుదులు పొందారు. పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ విశిష్ట పురస్కారంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ కళా రత్న ఉగాది పురస్కారం మరియు హంస పురస్కారం అందుకున్నారు. వేలాది మంది శిష్యులను తయారు చేశారు. ఆయన కుమారుడు డాక్టర్ కే వీ కృష్ణ ఎస్వీ సంగీత నృత్య కళాశాల వయొలిన్ విభాగాధిపతిగా సేవలందిస్తున్నారు. ఆయనకు అవార్డు లభించడం పట్ల ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా ముద్దు బాల, అధ్యాపకులు, టాప్ గ్రేడ్ కళాకారులు డాక్టర్ కే. వందన, కోటిపల్లి రమేష్, డాక్టర్ మండా అనంతకృష్ణ, యాళ్ల శ్రీవాణితో పాటు పలువురు సంగీత విద్వాంసులు, కళాకారులు, పుర ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# అరాచకాలపై విచారణలు... నివేదికలు చెత్తబుట్ట దాఖలు

శ్రీకాళహస్తి-ప్రభాతవార్త

ఏర్పేడుకు సమీపంలోని కొండ కొనల్లో సుమారు 100 సంవత్సరాల క్రితం మళయాళ సద్గురు చే స్థాపించిన పరమ పవిత్రమైన ఆధ్యాత్మిక దివ్యక్షేత్రంలో నేడు విలువలు కొనవడ్డాయి.సామాజిక కార్యక్రమాలకు తెరపడింది.సాక్షాత్తు పీఠాధిపతిపై సాధుపరిషత్‌యే మీడియా సమావేశంలో తప్పు పడుతూ మాట్లాడటం గమనించదగ్గ విషయం. ఓ వ్యక్తి ప్రవేశంతో ఆశ్రమం వివాదాలు, ఆరోపణలు, లైగింక వేదింపులకు నిలయంగా మారింది. విద్యాశాఖ ప్రస్తుతం ఉన్న జిల్లా కలెక్టర్ కూడా విచారణ జరిపారు. అయితే నివేదికలు సమర్పించారు. కానీ నివేదికలపై చర్యలు ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆశ్రమనిర్వాహకుల పలుకుబడితో విచారణ నివేదికలు చెత్తబుట్ట దాఖలు చేసారనే విమర్శలు బాహాటంగా ఉన్నాయి. మరి పవిత్ర ఆశయాలతో నిర్మించిన ఆశ్రమంలో నైతిక విలువల్నికాపాడే వారే లేదా? అని ధార్మిక వాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కేసుల విచారణ నివేదికలేమయ్యాయి?**

ఏర్పేడు ఆశ్రమంలో 2005కు పూర్వం పరిస్థితులు చాలా చక్కగా ఉండేది.అయితే ఆశ్రమంలో అప్పటి వరకు పీఠాధిపతులు ధార్మిక వాదులతో ఏర్పాటు చేసిన కమిటీలు ఉండేవి. వారు ఏ అంశాన్ని అయినా క్షుణ్ణంగా చర్చించుకుంటూ వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకునే వాతావరణం ఉండేది. పీఠాధిపతి తన బంధులు అమర్‌నాద్‌రెడ్డిని కోశాదికారిగా నియమించుకున్నప్పటి నుంచి వాతా వరణం మారింది. ముఖ్యంగా ఆశ్రమం కన్యాగురుకులంలో నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతున్న అంశాలకు సంబంధించి విద్యార్థినులను లైంగిక వేధింపులకు సంబంధించి వివాదాలు చోటు చేసుకున్నాయి. దాంతో 2008 ఆగస్టు 13న చిత్తూరుజిల్లా కలెక్టర్ ఆర్‌డిఓను విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు విచారణలో జిల్లా స్త్రీ శిశుసంక్షేమాభివృద్ధిసంస్థను భాగ స్వాములు చేసారు.ఈ మేరకు రెండు శాఖల అధికారులు విచారణ జరిపారు.ఇక్కడ లైంగిక వేధింపు లకు అమర్‌నాథ్‌రెడ్డి అప్పటి కన్యాగురుకులం వార్డెన్ రూపా 9వ తరగతి విద్యార్థినులను వేధింపులకు గురి చేసే కోశాధికారికి సహాకరించే వారని వారి విచారణలో తేలింది. విచారణ కమిటీ పలువురు విద్యార్థులను వేర్వేరుగా విచారించారు.నివేదికలను సమర్పించారు. ఈ మేరకు ఫిర్యాదులను ఎస్‌పికి డిఇఓ, ఐసిడియస్ ప్రాజెక్టు డైరెక్టర్ విచారణ నివేదికలను పొందు పరచి అందించారు.అయితే ఈ విచారణనను మేనేజ్ చేసి నిర్వాహాకులు మరో సారి తమకు అనుకూలంగా పోలీసులచే విచారణలు జరిపించుకున్నారు.ఈ అంశాలకు సంబంధించి కోర్టుల్లో నేటికి కేసులు నడుస్తున్నట్లు సమాచారం అయితే తమ గుట్టు బయట పడుతుందని భావించిన నిర్వాహాకులు 2008 ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు ఇచ్చిన టిసిలే నిదర్శనం అని ఇటీవల రాష్ట్రపతికి పంపిన ఫిర్యాదులో గాలి రవి ఆరోపించటం గమనించదగ్గ విషయం.

**చార్జెస్ ఏమయ్యాయి?**

లైంగిక వేధింపుల ఫిర్యాదులపై దేవాదాయశాఖ అధికారులు అనేక సార్లు విచారణ జరిపి అశ్రమంలో, అక్రమాలు వాస్తవమే నని తగు చర్యలు తీసు కోవాలని పై అధికారులకు నివేదికలు అందించారు. అందులో భాగంగానే అప్పటి దేవాదాయశాఖ కమిషనర్ పీఠాధిపతిపై చార్జెస్ ఫ్రేమ్ చేసారు.(కమిషనర్ వారి ఉత్తర్వులు ఆర్‌సి నెం.బి5/3995/2013 తేది 07.05.2014) జారి చేసారు. ఈ నాటి వరకు ఈ ఉత్తర్వులపై చర్యలేమిటో ఆ శివయ్యకే ఎరుక.మరి రెవెన్యూ అధికారులు దేవాదాయశాఖ అధికారుల మౌనం వెనుక అంతర్యమేమిటో ఎవ్వరికి అంతుపట్టడం లేదు.

## సర్ ఓట్లను సరిచూసుకోండి



శ్రీకాళహస్తి, జూన్ 13 ప్రభాతవార్త: ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల పరిశీలన కార్యక్రమాలను విజయవంతం చేయటానికి అన్ని రాజకీయ పార్టీలు జవాబుదారి తనంతో వ్యవహారించి సహాకరించాలని ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజనల్ అధికారి భాను ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏర్పాట్లును మున్సిపల్ కమిషనర్ కె.వికృష్ణారెడ్డి, తహసీల్దార్ టి.వి సుబ్రమణ్యంలు సిబ్బందిని హాజరు పరచారు. ఎన్నికల శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధికారులందరూ పాల్గొన్నారు.శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చేపడుతున్న చర్యలను అధికారులు సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా నకిలీ అనర్హ ఓట్లను గుర్తించి తొలగించడం, అర్హులైన ప్రతి భారత పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, అలాగే బిఎల్ఓలు, పిఎల్ఎలు, రాజకీయ పార్టీలు ప్రజల సహకారంతో ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడం గురించి చర్చించి స్పష్ఠతను ఇవ్వడం జరిగిందని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో జనసేన పార్టీ తరఫున పలు కీలక అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ఓటరు నమోదు, మార్పులు, తొలగింపులు, ధృవీకరణ ప్రక్రియలు మరియు పారదర్శకతకు సంబంధించిన పలు ప్రశ్నలను లేవనెత్తాము. వాటిపై సంబంధిత అధికారులు సంతృప్తికరమైన వివరణలు అందించడంతో సమావేశం ఎంతో నిర్మాణాత్మకంగా, ఫలప్రదంగా జరిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితాల స్వచ్ఛతే పునాది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయ కుమార్ నాయుడు, కాసరం రమేష్,ఢిల్లిబాబు,డాక్టర్ ఉమేష్‌రావు, ఖాదర్‌బాషా, కంఠా రమేష్, గోపినాథ్, వజ్రం కిషోర్, పేట బాలాజి, గోపినాథ్, రామకృష్ణ యాదవ్, వినయ్,కిట్టు,కెవి.ప్రతాప్,,భగత్ నాగరాజు, భాస్కర్ మధు,రాకేష్, సుప్రజ,మురళి, మీర్జా, జనసేన పార్టీ ముఖ్య నాయకులు రిటైర్డ్ ఎమ్మార్వో చంద్రశేఖర్ రావు, వెంకటేష్ రాయల్, నవీన్, పవన్ సాయి, ధన, చంద్ర, సతీష్, దిలీప్, సుబ్బు, శ్రీను, మునికుమార్, దినేష్ , చందు, ఉదయ్, సురేష్ లు పాల్గొన్నారు.

## ప్రసూతి ఆసుపత్రిలో అరుదైన శాస్త్ర చికిత్స

### - ఎస్ వి వైద్య కళాశాల, ప్రసూతి ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ప్రమీల దేవి



తిరుపతి హెల్త్, జూన్ 13 ప్రభాతవార్త: ప్రసూతి ఆసుపత్రిలో అరుదైన శాస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు ఎస్వి వైద్య కళాశాల, ప్రసూతి ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ప్రమీల దేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధ్వర్యంలో 30/25/30 సెం.మీ. భారీ అండాశయ కణితిని విజయవంతంగా తొలగించారన్నారు. ప్రసూతి ప్రభుత్వ ఆసుపత్రి, మరో అరుదైన క్లిష్టమైన శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించబడింది. పుత్తూరు మండ లంలోని శ్రీనివాసపురంకు చెందిన పాపమ్మ పొత్తికడుపు విపరీతంగా ఉబ్బడం, అసౌకర్యం వంటి లక్షణాలతో ఆసుపత్రిని ఆశ్రయించగా, పరీక్షల్లో ఆమెకు 30/25/30 సెం.మీ. పరిమాణంలో ఉన్న భారీ సీరస్ సిస్టాడెనోమా ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రసూతి స్త్రీ రోగ విభాగాధిపతి డా. ప్రమీలాదేవి, విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్సలో అసోసియేట్ ప్రొఫెసర్ డా. భువనేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. బాలాజీ మరియు డా. దీప కీలక పాత్ర పోషించారు. అంతటి భారీ కణితిని సురక్షితంగా తొలగించడంలో అనస్థీషియాలజీ విభాగం విశేష సహకారం అందించింది. అనస్థీషియాలజీ విభాగాధిపతి డా. టి. పద్మ, పర్యవేక్షణలో, ప్రొఫెసర్ డా. జీవన్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బృంద రోగికి అత్యుత్తమ అనస్థీషియా సేవలు అందించి శస్త్రచికిత్స విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు. శస్త్ర చికిత్స సమయంలో రోగి భద్రతను, శారీరక స్థిరత్వాన్ని సమర్థవంతంగా నిర్వహించి అనస్థీషియా బృందం తమ నైపుణ్యాన్ని చాటుకుంది. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండి సంతృప్తికరంగా కోలుకుంటున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ప్రసూతి వైద్యశాల సూపరిటెండెంట్ డాక్టర్ ప్రమీల దేవి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వైద్య విద్య, పరిశోధన, ప్రజారోగ్య సేవలలో రాష్ట్రవ్యాప్తంగా విశిష్ట సేవలు అందిస్తున్నాయని, అత్యాధునిక వైద్య సదుపాయాలు మరియు నిపుణులైన వైద్య బృందంతో క్లిష్టమైన శస్త్రచికిత్సలను కూడా విజయవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య వైద్య సేవలను అందిస్తున్నామని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రసూతి స్త్రీ రోగ విభాగాధిపతి డా. ప్రమీలాదేవి తెలిపారు. ఈ సందర్భంగా అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సి పాల్ డాక్టర్ జి.రవి ప్రభు మాట్లాడుతూ ఈ అరుదైన శాస్త్ర చికిత్స చేసిన బృందాన్ని అభినందించారు, ఇలాంటి శాస్త్ర చికిత్సలు పేద రోగులకు మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలను పేద రోగులకు మనం అందించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులలో నిర్వహిస్తే లక్షలాది రూపాయలు ఖర్చు అయే ఈ అరుదైన శస్త్ర చికిత్సను ప్రభుత్వ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా నిర్వహించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసూతి ఆసుపత్రి వైద్య బృందం, పీజీ వైద్య విద్యార్థిని, విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది, తదుతరులు పాల్గొన్నారు.

## సుప్రీం మాజీ ప్రధాన న్యాయమూర్తి పూజలు



శ్రీకాళహస్తి,జూన్ 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయ మూర్తి బిఆర్ గవాయి కుటుంబ సభ్యులతో పూజలు జరిపించుకున్నారు. ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో వేదపండితులతో ఆలయ ఇఓ బికె వెంకటేశులు,ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్‌ఓ రవిలు స్వా గతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్నవారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు ఏర్పాటు చేసారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్సె పెక్టర్ వెంకటస్వామి,అలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు. న్యాయస్థానాల తరఫున జడ్జి నరసింహామూర్తి పాల్గొన్నారు.

## కమిషనర్‌ను సత్కరించిన...శానిటేషన్ యూనియన్



శ్రీకాళహస్తి,జూన్ 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ కెవి కృష్ణారెడ్డిని మున్సిపల్ శానిటేషన్ యూనియన్ నాయకులు కలసి సత్కరించారు. యూనియన్ నాయకులు అధ్యక్షుడు జాన్, కార్యదర్శి కోగిల హరి, సహాయ కార్యదర్శులు శారదమ్మ, కొండమ్మలు కలసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు పలు సమస్యలను విన్నవించారు. శ్రీకాళహస్తి పట్టణ పరిధి బాగా పెరిగిందని కానీ శానిటేషన్‌లో రెగ్యూలర్ సిబ్బంది సంఖ్య గణనీయంగా తగ్గిందని అయితే ఇటీవల కాలంలో ఐదుగురు రెగ్యూలర్ ఉద్యోగులు చని పోయారని ఆ ఉద్యోగాలు వారి కుటుంబ సభ్యులకు ఇవ్వాలని అభ్యర్థించారు. కాగా శానిటేషన్‌కు ఉపయోగించే కాంపాక్టు వాహనాలు మరమ్మతులకు గురై ట్రాక్టర్లతో చెత్తలను తొలగిస్తున్నామని వాహనాలు మరమ్మతులు చేయాలని కోరారు. కాగా ప్రస్తుతం పారిశుద్ధ్య బాధ్యతలు సచివాలయ ఉద్యోగులకు అప్పగించటం వల్ల కొంత ఇబ్బందిగా ఉందని పర్యవేక్షణ బాధ్యతను శానిటరీ ఇన్సె పెక్టర్లకు అప్పగిస్తే కొంత మెరుగ్గా ఉంటుందని తమ అభిప్రాయాన్ని కమిషనర్‌కు వివరించారు.

## రూట్‌లో కల్తీ పాలు!
## డిపోలో తక్కువ కొలతలతో



శ్రీకాళహస్తి,జూన్ 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ పాలసరఫరా సంఘం తరఫున చుట్టుపక్కల గ్రామాల్లోని పాడి రైతుల నుంచి పాలను సేకరించి కొంత పట్టణంలో సైకిళ్ళపై వెండర్లు విక్రయిస్తున్నారు. మరి కొంత చుట్టపక్కల ప్రజల సౌకర్యార్థం డిపోలోనే ఓ కౌంటర్‌ను ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. అయితే ఆది నుంచి సైకిళ్ళపై విక్రయిస్తున్న పాలలో నీళ్ల శాతం ఎక్కువనే ఆరోపణలు న్నాయి. అంతేకాక తక్కువ కొలతలతో సొంత కొలతలతో తయారు చేసుకున్న కొలమానికలతో అందిస్తున్నారు. అయితే ఈ విషయానికి సంబంధించి కొలతలు, తూనికల విభాగం పట్టించుకోవటం లేదు. గతంలో తరచూ పరిశీలించే వారని, దాంతో వెండర్లకు కొంత మేరకు భయం ఉండేది. ఇక రైతుల వద్ద నుంచి సేకరించే పాలకు పట్టణంలో విక్రయించే పాలకు తేడా ఉంటుంది. పట్టణంలో విక్రయించే పాలలో నీళ్ల శాతం అధికంగా ఉందని వినియోగదారులు వాపోతున్నారు. అయితే వినియోగదారుల వేదనను ఎవరు పట్టించుకుంటారు. ఇక డిపో వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లో తక్కువ కొలతలు రాజ్యమేలుతుంది. ఎవరైనా అడిగితే మేము ఇచ్చేది అంతే అంటూ సమాధానం చెబుతున్నారు. పెద్దమసీదు వీధికి చెందిన అహమ్మద్ బాషా(రిటైర్డ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి) డిపో వద్ద పాలు తీసుకుంటే లీటర్‌కు 50 నుంచి 100 మిల్లిలీటర్ల పాల తక్కువగా ఉండగా, ఆయన ఇదేమి అంటూ నిలదీయగా మేము అంతే ఇస్తామంటూ సమాధానం చెప్పటంతో ఆయన మీడియాకు తమ బాధలను విన్నవించారు.

**చైర్మెన్ వివరణ:**

శ్రీకాళహస్తి కోఆపరేటివ్ పాలసరఫరా సంఘానికి సంబంధించిన పాల సరఫరాలో కల్తీ, తక్కువ తూకాలకు సంబంధించిన ఆరోపణలపై పాలకమండలి చైర్మెన్ మునగాల మధుసూధననాయుడు (చిట్టి)ను వివరణ కోరగా, తాము నెలకు కనీసం 12 మంది నుంచి జరిమానాలు వసూలు చేస్తున్నామని వివరించారు. ప్రతి రోజూ తనకిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. తరచూ పట్టణంలో సరఫరా చేసే పాలకు సంబంధించి తనీఖీలు చేస్తున్నామని వివరణ ఇచ్చారు.

## గుడిమల్లంకు టూరిజం బస్సుల ట్రయల్ రన్



ఏర్పేడు,జూన్ 13 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం గుడిమల్లం ఆలయానికి టూరిజం శాఖకు చెందిన బస్సులను ప్యాకేజీలకు ట్రయల్ రన్ శనివారం నిడిపారు. ఇటీవల పరశురామేశ్వరాలయానికి వచ్చిన టూరిజం అధికారులను ఆలయప్రతిష్టను తెలియజేయటానికి టూరిజం బస్సులను నడపాలని ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తల గిరి నాయుడు అభ్యర్థించారు. టూరిజం బస్సును ట్రయల్‌రన్‌గా తిరుపతి నుంచి ఆపరేట్ చేసారు. మొదటి ట్రిప్పులో 60మంది ప్రయాణీకులు వచ్చారు.ఈ సందర్భంగా గిరి నాయుడు వారిని స్వాగతించారు. ఆలయంలో ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసారు. వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.ఆలయ ఇఓ మునిశేఖర్ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసారు.

### మండలాభివృద్ధికి...

## జవాబుదారి తనంతో పని చేయండి : ఎమ్మెల్యే



ఏర్పేడు,జూన్ 13 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం అభివృద్ది పనులకు సంబంధించి శనివారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మండల నాయకులతో మండల కేంద్రంలో సమీక్షించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ది పనులకు నిధులు విడుదల చేస్తుందని అయితే వాటిని సద్వినియోగం చేయాలని సూచించారు. ఏర్పేడు మండలం విద్యాపరంగాను, పారిశ్రామికంగాను అభివృద్ధి చెందుతుంది. రాబోవు పంచాయతీ ఎన్నికల్లో అన్ని పంచాయతీలు ప్రజాస్వామ్య బద్ధంగా తెలుగుదేశం ఖాతాలోకి రావాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు ప్రజలతోమమేకం కావాలని సూచించారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని సూచించారు. ప్రతి పంచాయతీకి ప్రభుత్వం అభివృద్ధికి నిధులు ఇస్తుందిఅవి ప్రజలకు తెలిసేటట్టు పనులు చేయాలని ఆదేశించారు. ఏ గ్రామంలో ఏమి కావాల్లో గుర్తించి ప్రధాన్యతా క్రమంలో చేపట్టాలని సూచించారు.రాబోవు రోజులు కీలకమని ప్రతి నాయకుడు ఓటర్ల జాబితాలను సరి చూసుకోవాలని పార్టీ ఓటర్లు కు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు, ధనంజయులు నాయుడు, శివశంకర్‌రెడ్డి, బాబు నాయుడు, గుణయాదవ్ రాచేటి సుబ్రమణ్యం చంద్ర,కేతినేని సుబ్రమణ్యం, కృష్ణవేణి, అశ్వత్థామ, గణేష్‌నాయుడు రామచంద్ర, మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతే...ప్రజారోగ్యం



బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 13 ప్రభాతవార్త: పరిసరాల పరిశుభ్రతే ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఇంటింటా చెత్తసేకరణ వాహనాలను నిర్వహించే పారిశుద్ధ కార్మికులను ఏర్పాటు చేసిందని ప్రజలు చెత్త సేకరణ వాహనాలలో మాత్రమే వేయాలని పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీర్పాకోట గ్రామ ప్రజలు పారిశుద్ధ్య పనులపై వ్యక్తిగతంగా మన ఊరు మన ఆరోగ్యం అనే బాధ్యతగా ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా పాటించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందాలని ఆమె సూచించారు. తడిపొడి చెత్తలను ఎక్కడపడితే అక్కడ పడేయడం దాని వలప కీటకాలు దోమలు వ్యాప్తి చెంది అనారోగ్య సమస్యలు ఏర్పడుతాయని ఆమె అన్నారు. ఇంటింటి చెత్త సేకరణ పారిశుద్ధ్య కార్మికులను గ్రామీణా ప్రాంత ప్రజలు సహకరించాలని పంచాయితీలకు సంబందించి అభివృద్ధిపనుల కోసం గ్రామ సచివాలయం అధికారులతో సంప్రదింపులు చేయాలని ఆమె సూచించారు.

## గంగమ్మ జాతరలో కోలటాల వేడుకలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 13 ప్రభాతవార్త: నీర్పాకోట గంగమ్మ జాతర మహోత్సవ రెండవ రోజు వేడుకలో శనివారం కోలాట కార్యక్రమం నిర్వహిం చినట్టు జాతర కమిటి సభ్యులు తెలిపారు.అందులో భాగంగా ఉత్సవాలలో పూజ నిర్వహించిన అనంతరం కోలాట కార్యక్రమం భక్తులు స్దానికులు అధిక సంఖ్యలో పాల్గొని విక్షింక్షి వేడుకలను జరుపుకున్నారు. ఆదివారం చివరి రోజు సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షలు పొందాలని జాతర కమిటి సభ్యులు కోరారు.

## నేడు రక్తదాన శిబిరం

శ్రీకాళహస్తి జూన్ 13 ప్రభాతవార్త: ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలోని ఏరియా ఆసుపత్రివద్ద ఆదివారం నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఏఐఎస ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోగిల మునిచందు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమందరము ఇచ్చే రక్తదానం ప్రాణాపాయస్దితిలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందన్నారు. దాతలు ముందుకిచ్చి రక్తదానం చేయాలని ఆయన కోరారు.